
కథ

# అదిగో పులి

**అర్షాద్**

సమయం ఉదయం ఏడు గంటలు. ఆహ్లాదకరమైన వాతావరణం. వర్షం అమృతమై కురుస్తోంది. కురిసే అమృతంలో వీరన్న తడుస్తున్నాడు. తడుస్తూ నడుస్తున్నాడు. అతని వయసు యాభై ఏళ్లు దాటినా వర్షం ఎదురయితే చాలు- చిన్నపిల్లవాడు అయిపోతాడు. తనివితీరా తడుస్తాడు. ఎంత తడిసినా జలుబూ, జ్వరం అతని జోలికి రావు.



కంపెనీ టౌన్‌షిప్ చుట్టూ ప్రహరీ ఉంది. ప్రహరీ చుట్టూ సిమెంట్ రోడ్డు ఉంది. రోడ్డుకిరువైపులా దట్టంగా బలిసిన పచ్చపచ్చని చెట్లు ఉన్నాయి. చెట్ల మధ్య వున్న ఆ సర్కిల్ రోడ్డుపై వీరన్న నడుస్తున్నాడు.

వర్షపు పారవశ్యంలో అలా ఎంతసేపో స్నానమాడి వీరన్న ఇంటికి చేరలేక చేరేడు చివరికి.

చేరిన ఇల్లు కూడా అతనికి ఆనందాన్ని కలిగిస్తోంది.

చెట్ల మధ్య పర్ణశాలలా ఉన్న ఇల్లు ఫ్రిజ్‌లోంచి తీసినట్టు చల్ల చల్లగా హాయి హాయిగా ఉంది.

వీరన్నది చీకు చింతాలేని చిన్న కుటుంబం. భార్య ముగ్గురు పిల్లలు.

భార్య పేరు పార్వతమ్మ. చేమంతి పూబంతి లాంటి చక్కని ఇద్దరు కూతుళ్లు. పనసపండులాంటి కొడుకు.

వర్షంలో తడిసి వచ్చిన తండ్రికి చేమంతి పరుగు పరుగున టవల్ తెచ్చింది. తేవడమేకాదు, తనే స్వయంగా తండ్రి తల తుడిచింది. తుడవడమేకాదు దువ్వెనతో తల దువ్వింది.

రెండో కూతురు పూబంతి తనేమీ తక్కువ తినలేదన్నట్టు తండ్రిని తడిసిన బట్టలు మార్చుకొమ్మని చెప్పి, లుంగీ, బనియన్ తెచ్చింది. తడిసిన బట్టలను పిండి ఇంట్లో తీగపై ఆరేసింది.

మరిక ముద్దులకొడుకు పనసపండుబాబు తండ్రికి వాలు కుర్చీ వేసి, వంటగది నుంచి గరమ్ గరమ్ ఛాయ్‌ని తల్లి చేతుల్లోంచి లాక్కొని పరుగున తెచ్చి ఇచ్చేడు తండ్రికి.

ఇదంతా ఒక అందమైన కలలా చూస్తూ, ముసి ముసి నవ్వులు చిందించింది పార్వతమ్మ. సౌందర్యం, నైర్మల్యం, ముగ్ధత్వం మూర్తీభవించినట్టు ఎంతో చక్కగా ఉంటుంది ఆమె.

రేపు ఏదో పెద్ద పండగ చేసుకోబోతున్నట్టు ముగ్గురు పిల్లలూ సందడిగా పరమానందభరితంగా ఉన్నారు. వాళ్లకి ప్రతి వస్తువు, ప్రతి దృశ్యం ఆనందోహాతువులుగా అలరిస్తున్నాయి.

మరో రెండు రోజుల్లో వీరన్న.. ఆరణాల కార్మికుడు వీరన్న ఏకంగా ఎనిమిది లక్షల యాభైవేల రూపాయలకు అధిపతి కాబోతున్నాడు. అంత డబ్బు ఆ ఇంట్లో ఎవరూ ఎప్పుడూ చూసి వుండలేదు. అందుకే అంత సంబరం.

గత వారం పదిరోజులుగా ఆ ఎనిమిదిన్నర లక్షలను ఏమి చేయాలి అనేది అక్కడ తీవ్రాతి తీవ్రంగా చర్చింపబడుతున్నది. చర్చల్లో పార్వతమ్మది కేవలం ప్రేక్షకపాత్రే! చివరికి ఈ విధంగా తీర్మానించేరు.

పెద్దకూతురు చేమంతికి రెండేళ్ల కిందట పెళ్లి అయింది.

అల్లుడు బుద్ధిమంతుడు. రైతు కుటుంబానికి చెందినవాడు. ఈ ఏడాది కరువులో పంటలు దెబ్బతిన్నాయి. తండ్రిని ఆర్థికంగా కొంత సహకరించమని కూతురు వేడుకుంది. తండ్రి లక్ష రూపాయలు ఇవ్వడానికి నిర్ణయించడమైనది.

చిన్నకూతురు పూబంతి యం.సి.ఏ. చదువుతోంది. చదువుపూర్తిచేసి ఉద్యోగం చేస్తాను. అప్పుడే పెళ్లి చేసుకోను అని అంటున్నప్పటికీ రేపు మాఘమాసంలో ఆమెకు పెళ్లి చేసేయాలనే నిర్ణయం తీసుకోవడం జరిగింది. అందుకోసం ప్రస్తుతం మూడు లక్షలు పూబంతి పేర బ్యాంక్‌లో వేయుట.

ఏకైక కొడుకు పనసపండు చురుకైనవాడు. చదువుతున్నది ఇంజినీరింగ్. ఆ చదువు ఇంకా రెండేళ్లు వుంది గనుక వాడి చదువులకి ఒక లక్ష రూపాయలు.

మిగతా సొమ్ము బ్యాంక్‌లో వేయడానికి వడ్డీ రేట్లు పెద్ద బాగోలేవు గనుక కొంత సొమ్ము ఏదైనా చిట్‌ఫండ్‌లో ఇన్వెస్ట్ చేసి ఆ డబ్బుపై నెల నెలా వచ్చే వడ్డీతో సంసార నావని లాగుట. ఆ పని పార్వతమ్మది.

వీరన్న ఒక ప్రభుత్వ రంగ సంస్థలో సీనియర్ స్కిల్డ్ వర్కర్. ఆ కంపెనీ రూలు ప్రకారంగా అరవై సంవత్సరాలకి రిటైర్‌మెంట్. వీరన్న వయసు ప్రస్తుతం యాభై ఒకటి. ఇంకా తొమ్మిదేళ్ల సర్వీసు ఉంది. అయినప్పటికీ వీరన్న బాజాలతో రిటైరవుతున్నాడు. అది విశేషం.

గత మూడేళ్లగా ఆ కంపెనీ వాలెంటరీ రిటైర్‌మెంట్ స్కీం (విఆర్‌యస్) అనులు పరుస్తోంది.

ఆ స్కీం ప్రకారం వీరన్న గొడ్డులా రోజా కష్టపడి మరో తొమ్మిదేళ్లు పనిచేయనక్కర్లేకుండానే బేలన్స్ సర్వీస్‌కి లెక్కలు వేసి అయిదు లక్షలు వూర్కెనే ఇస్తున్నారు కంపెనీవారు.

ఓహ్! పనిచేయకుండా అయిదు లక్షలు! అమ్మ కూడా ఇవ్వదు!


ఇక పియఫ్, గ్రాట్యుటీ వగైరా మరో మూడున్నర లక్షలు వస్తున్నాయి. మొత్తం ప్యాకేజీ ఎనిమిదిన్నర లక్షలు. మరో రెండు రోజుల్లో వీరన్న చేతిలోకి రాబోతున్నాయి.

ఏమి అదృష్టం!

యోగం అన్నది రాసిపెట్టి ఉన్నాక దాన్నెవరూ ఆపలేరు అని వీరన్న నమ్మకం. అంతేకాదు భగవంతుడు ఉన్నాడనే సత్యం ఇలాంటి సమయాలలోనే నిరూపితమవుతుంది. తను రోజా దేవుడికి చేసిన పూజలు ఫలించేయి. అంచేత అతి త్వరలోనే కుటుంబం మొత్తం (అల్లుడితో సహా) తిరుపతి దర్శించుకు వచ్చేయాలని నిశ్చయించుకున్నాడు.

సమయం రెండు గంటలవుతోంది. సన్నగా వర్షం ఇంకా పడుతూనే ఉంది.

వీరన్న భోజనం ముగించి నడుం వాల్చేడు. తను ఈరోజు డ్యూటీకి ఎగనామం పెట్టేశాడు. మార్నింగ్ షిఫ్ట్‌కి వెళ్లాలి. కాని తనకి ఇష్టమైన వానదేవత తెల్లవారక




ముందే వాకిట్లోకి వచ్చి రా రమ్మని లాక్కుపోయింది. వర్షంలో తడవటం తన బలహీనత. ఏం చేస్తాడు?

వీరన్న నిద్రకి ఉపక్రమించేలోగా-

పరుగు పరుగున వీరన్న మిత్రుడు మల్లయ్య ఒక వార్త మోసుకొచ్చేడు.

వార్తకాదు. అశనిపాతం. పిడుగుపాటు.

కంపెనీ గంట క్రితం అధికారికంగా వి.ఆర్.యస్. లిస్టు ప్రకటించిందట. అందులో వీరన్న పేరు లేదట. అందులో మల్లయ్య పేరు కూడా వుంది.

వీరన్న పేరు మాత్రం లేదు.

మల్లయ్య నోటిమాట కాకుండా డబ్బుయోగం వున్న ఉద్యోగుల లిస్టు జెరాక్సు కాపీ చూపించి, వీరన్న పేరు లేనందుకు విచారం తెలియజేసి వెళిపోయేడు.

నిస్సత్తువగా కూలబడిపోయేడు వీరన్న.

ముగ్గురు పిల్లల ముఖాలు గాలి తీసేసిన బుడగల్లా వాడిపోయాయి.

''బాధ పడొద్దు. ఏదైనా మన మంచికే'' అంది పార్వతమ్మ.

సర్రున లేచాడు వీరన్న.

''నోరు మూస్తావా? మరెక్కువగా మాటాడేవంటే పళ్లు రాలిపోయేలా మూతిమీద గుద్దేస్తాను. చూస్తున్నాను కదూ. మొగుడికి డబ్బు వస్తుందంటే సంతోషించవలసింది పోయి ఏడుపు ముఖం పెట్టేవు. నీ ఏడుపే నాకు తగిలేసింది'' అంటూ వీరన్న మంచం మీద నుంచి లేచేడు.

ఎక్కడో ఏదో కుట్ర జరిగింది. నిన్న మొన్నటి వరకూ నలుగుతున్న తన పేరు ఈరోజు సడన్‌గా అంతర్థానమయిపోవడం ఏమిటి? ఏదో జరిగింది. దీని అంతుచూడాలి. తన పేరు ఆ విఆర్‌యస్ లిస్టులో చేరే వరకు నిద్రపోయేది లేదు.

రెండు నిమిషాల్లో తయారై కంపెనీ వైపు పరిగెట్టేడు వీరన్న.

చల్లటి చినుకులు అతనిపై మేకుల్లా పడి చికాకు కలిగిస్తున్నాయి.

తలకి రుమాలు చుట్టుకొని వడివడిగా కంపెనీ వైపు నడిచేడు.

రోడ్డుపై నడుస్తున్న వీరన్నను ఒక వృద్ధురాలు పలకరించింది. వానచప్పుడులో సరిగా వినబడలేదు. ఆమె చూడటానికి చాలా దీనంగా ఉంది. కడు బీదగా ఉంది. రెండు, మూడు రోజులుగా ఆకలితోనే అలమటిస్తున్నట్టు, మాటాడే శక్తి లేనట్టు ఉంది. వీరన్నని ఆపి ఏదో మాటాడబోయింది.

ఆమె తనను ఆపినందుకు ముఖం చిట్లించుకున్నాడు ఒక రూపాయి జేబులోంచి తీసి ఆమె చేతిలో పడేసి విసురుగా వెళ్ళిపోయేడు. ఆమె పిలుస్తునే ఉంది వినిపించుకోలేదు వీరన్న.

ఇంటి దగ్గర పార్వతమ్మ వీరన్న బయటకు వెళిపోయిన వెంటనే దేవుడి గదిలోకి వెళ్లి దండం పెట్టుకుంది.

తర్వాత భాస్కరబాబుకి కూడా మనసులో వేయి నమస్కారాలు పెట్టింది. అవును. భాస్కరబాబు కూడా ఆమెకు దేవుడే!

★ ★ ★

భాస్కరబాబుపై వీరన్నకి విపరీతంగా కోపం వచ్చింది.

విఆర్‌యస్ లిస్ట్‌లో తన పేరు లేకుండా చేయడంలో భాస్కరబాబే చక్రం తిప్పేడనే విషయం తెలిసేక వీరన్న షాక్ తినేసాడు. అతను అంతటి ద్రోహానికి తలపడేవాడని ఏమాత్రం ఊహించలేకపోయేడు. తను పెర్సనల్ డిపార్టుమెంటుకి డైరక్టుగా వెళ్లి అక్కడ గట్టిగా గొడవ పడి కేకలు వేస్తే...చివరకు తేలింది ఏమిటంటే భాస్కరబాబు కావాలనే తన అప్లికేషన్ నొక్కిపెట్టేసాడట. వి.ఆర్.యస్.కి రికమెండ్ చేయలేదట.

అసలు పెద్దవాళ్లను నమ్మడం, నమ్మకంగా పనిచేయడం మనదే తప్పు.

ఈ కంపెనీలో కష్టపడి పనిచేయడమే పాపం. మహా పాపం.

'కష్టేఫలి' అంటారు.

ఈ పెద్దమనిషి భాస్కరబాబు 'కష్టేఫలి' అని తనని ఈ కంపెనీ కారాగారంలో బందీగా చేసేశాడు. వీరన్నకి ఎక్కడలేని దుఃఖం వచ్చింది. దుఃఖం కోపంగా రూపాంతరం చెందింది.

'వీఆర్‌యస్ ఇవ్వకపోతే పోయే. ఉద్యోగానికి రాజీనామా అయినా చేసేస్తాను గాని, మరిక ఈ కంపెనీలో పనిచేయను' అనుకొని అమీ తుమీ తేల్చుకుందామని, భాస్కరబాబు ఆఫీసుకి వెళ్లేడు వీరన్న.

భాస్కరబాబు లేడు. మేనేజ్‌మెంట్ కమిటీ మీటింగ్ అట. అతడు వెళ్లి అరగంట అయిందట. కాని ఎప్పుడు తిరిగివస్తాడో తెలియదట- భాస్కరబాబు పి.ఏ. తెలియజేసాడు.

**ఆంధ్రభూమి-ఆటా పోటీలో ఎంపికైన కథ**

''ఫర్లేదు వచ్చేవరకు ఉంటాను'' అన్నాడు వీరన్న.


ఆ కంపెనీలో భాస్కరబాబు జనరల్ మేనేజర్. కంపెనీ ఉత్పత్తికి సంబంధించిన వ్యవహారాలన్నీ తనే చూసుకుంటాడు. మనిషి ఆరడుగుల విగ్రహం. ప్రసన్న మైన ముఖం. చెరగని చిరునవ్వు. కంటి అద్దాల వెనుక పలకరించే చురుకైన కళ్లు. వయసు 53. భార్య పేరు శకుంతలమ్మ. ఇద్దరు పిల్లలు. వాళ్లు ఇక్కడ లేరు. అమెరికాలో ఉద్యోగాలు చేస్తున్నారు. వాలంటరీ రిటైర్‌మెంట్ తీసుకొని అమెరికా వచ్చేయమంటారు పిల్లలు. 'నేను పనిచేస్తున్న కంపెనీ నా తల్లి. తల్లిని నేను వదలి రాలేను' అంటాడు భాస్కరబాబు నవ్వుతూ.

అతడు మంచితనానికి మారుపేరు. నిగర్వి. నిరాడంబరుడు. మనిషి ఎంత సౌమ్యుడో వర్క్ విషయంలో అంత కఠినుడు. ప్రొడక్షన్ షెడ్యూల్ ప్రకారం పనులన్నీ చకచకా సాగిపోవాలి. వర్కర్స్ నుంచి తను అనుకున్న పని సాధించి తీరుతాడు. అందుకు కారణం అతడు తోటి ఉద్యోగులను, కార్మికులను ప్రేమించడమే వాళ్ల సమస్యలను సానుకూలంగా అర్థం చేసుకుని పరిష్కరించడమే. అతని హృదయం నుండి తోటిజీవుల యెడల ప్రేమ వాహిని ఎడతెరిపి లేకుండా ప్రవహిస్తూనే ఉంటుంది.

తను పనిచేస్తున్న కంపెనీని-నిజమే-కన్నతల్లిలా ప్రేమిస్తాడు. అయితే నాలుగైదేళ్లగా కంపెనీ ఆటుపోట్లకు లోనయి నష్టాలలోకి వెళ్లిపోవడం అతనికి బాధ కలిగిస్తోంది. లాభాలతో తొణికిసలాడే పటిష్టమైన ఈ కంపెనీని కావాలనే యాజమాన్యం నిర్వీర్యపరచడం చూస్తున్నాడు. చూస్తూ, చూస్తూ, ఏమీ చేయలేని అశక్తుడే అవుతున్నాడు. మేనేజ్‌మెంట్ కమిటీలో తనూ ఒక మెంబర్ అయినప్పటికీ మంచిని పెంచలేని, చెడుని ఆపలేని నిస్సహాయత. దుస్థితి. ఒక్కడైపోయేడు!

## పరిపూర్ణత

**పెళ్లి జీవితానికి పరిపూర్ణత ఇస్తుందంటారు. ఇప్పుడు సిమ్రాన్ పరిస్థితి అలాగే ఉంది. సినిమాల్లో గ్లామర్‌కంటే పెర్‌ఫార్మెన్స్‌కి అధిక ప్రాధాన్యత ఇచ్చే సిమ్రాన్ ఇప్పుడు ఓ బిడ్డకి త్వరలో తల్లి కాబోతోంది. గ్లామర్ పుష్కలంగా ఉన్నా అవకాశాల విషయంలో ఆమె చాలా రిజర్వ్‌డ్‌గా ఉంటోంది. 'సినిమాల్లో అవకాశాలు వస్తున్నా రెమ్యూనరేషన్ విషయంలో ఇబ్బందులకి అవకాశం ఇవ్వదలుచుకోలేదు' అంటోంది.**



ఒకప్పుడు బంగారంలాంటి కంపెనీ ఇది. ఉన్నత ప్రమాణాలకు, నాణ్యమైన పరికరాల తయారీకి ఈ గవర్నమెంటు కంపెనీ పెట్టింది పేరు. గత నలభై సంవత్సరాలుగా ఈ కంపెనీ ముందు ఏ ప్రయివేటు కంపెనీలు నిలబడలేకపోయేవి. అయితే గత కొద్ది సంవత్సరాలుగా కంపెనీ సినారియో మారిపోయింది. ఒకప్పుడు పోటీకి నిలబడలేని ప్రయివేటు కంపెనీలను నిలబెట్టడానికో లేక ఈ గవర్నమెంటు కంపెనీని ప్రయివేటైజ్ చేయడానికో విశ్వప్రయత్నాలు జరుగుతున్నాయి.

ఈమధ్య డిపార్ట్‌మెంట్ ఆఫ్ డిజిన్వెస్ట్‌మెంట్ మంత్రిగారు దేశంలో 31 పరిశ్రమల్ని ప్రయివేటీకరించబోతున్నట్టు ప్రకటించేరు. అందులో ఈ కంపెనీ ఒకటి. అంటే ఏమిటి? దీని వెనుక ప్రయివేటీకరణ, సరళీకరణ శక్తుల ప్రభావం మరోవైపు ప్రపంచ బ్యాంక్, ఐయమ్ఎఫ్‌ల ఒత్తిడి ప్రస్ఫుటంగా కనిపిస్తున్న విషయం భాస్కరబాబు గమనిస్తూనే ఉన్నాడు.

యాజమాన్యం కొత్త ఆర్డర్‌బుక్ ఎంకరేజ్ చేయడం లేదు. మరోవైపు సగానికి పైగా ఉద్యోగులను, వీఆర్‌యస్ పేరిట బయటకు పంపించేసి కంపెనీని ప్రయివేటు కంపెనీకి లేదా బహుళజాతి సంస్థకి కారుచౌకగా అమ్మకానికి పెట్టడమే ప్రభుత్వ పథకం.

తను చూస్తుండగానే గత మూడేళ్లలో స్వచ్ఛంద పదవీ విరమణ స్కీం కింద వేయిమందికి పైగా ఉద్యోగస్తులు వెళ్ళిపోయేరు. ఈ వాలంటరీ రిటైర్‌మెంటు నిజానికి స్వచ్ఛందం కాదు. రకరకాల ఎత్తుగడలతో ఉద్యోగులను లాలించి లేకుంటే బెదిరించి, భయపెట్టి రిట్రెంచ్ చేస్తున్నారు. ఏమైతేనేం వీఆర్‌యస్‌లను ఆకర్షణీయమైన ప్యాకేజీలుగా అభివర్ణించి ప్రచారం చేసి చాలా మంది ఉద్యోగులను ఆకట్టుకునేలా చేయడంలో చాలా వరకు యాజమాన్యం వారు సఫలీకృతులవుతున్నారు.

దీపం పురుగులా వీరన్న కూడా వీఆర్‌యస్ పట్ల ఆకర్షింపబడ్డాడు.

భాస్కరబాబు పెట్టవద్దని చెప్పినా వినలేదు వీరన్న.

వీరన్న అంటే ఒక ప్రత్యేకమైన అభిమానం భాస్కరబాబుకి. అందుకు ఓ ప్రత్యేక కారణాలు అంటూ ఏమీ లేవు. వీరన్న కష్టపడే తత్వం, పనిపట్ల పట్టుదల, పనిపై అంకిత భావం, చురుకుతనం, నిజాయితీ తనని ఆకర్షించి ఉండొచ్చు.

అదేవిధంగా భాస్కరబాబు అంటే ప్రాణానిచ్చేస్తాడు వీరన్న. అంతటి వీరాభిమాని. మరెంతో భక్తి. క్రమక్రమేణ ఆ పెద్ద ఆఫీసరు, ఈ చిన్నవర్కరు మధ్య అనుబంధం కంపెనీ పని వరకే కాకుండా కుటుంబ వ్యవహారాలు వరకూ వెళ్లేయి.

వీరన్న భాస్కరబాబు సలహా, సహకారాలు లేకుండా ఏ పనీ చేయడు. అతని పెద్దమ్మాయి నిశ్చితార్థం నుంచి పెళ్లివరకు భాస్కరబాబు ముందుండి నిలబడ్డాడు. అలాగే రెండో కూతురు, కొడుకు చదువుల వెనుక భాస్కరబాబు గైడెన్స్ లేకుండా, వీరన్న ఏమీ నిర్ణయాలు తీసుకోలేదు.

కంపెనీ క్వార్టర్స్‌లోనే ఆ రెండు కుటుంబాలు ఉంటున్నాయి. వీరన్నే కాకుండా అతని భార్య పార్వతమ్మ, పిల్లలూ తరచుగా భాస్కరబాబు ఇంటికి వెళ్ళే చనువు ఏర్పడింది. అలాగే అప్పుడప్పుడు భాస్కరబాబు తన భార్య శకుంతలమ్మతో వీరన్న ఇంటికి వెళ్లడం కూడా జరుగుతుంటుంది. గుణగణాల నుంచి మంచీ మర్యాద వరకూ భాస్కరబాబుకి ఏమీ తీసిపోదు శకుంతలమ్మ. ఆమె గుడిలో దేవతలా కనిపిస్తుంది వీరన్న కుటుంబానికి.

ఆ రెండు కుటుంబాల మధ్య విచిత్ర అనుబంధానికి (వాళ్లది కులమూ ఒక్కటి కాదు, చివరికి జిల్లా కూడా ఒక్కటి కాదు) మిగతా ఉద్యోగులు విస్తుపోతారు. అసూయ చెందుతారు.

భాస్కరబాబు అంటే ప్రాణమిచ్చే వీరన్న ఈరోజు అతనిపై కోపంతో నిప్పులు కక్కుతున్నాడు. ఒక నియంతలా తన పేరు వీఆర్‌యస్ లిస్ట్‌లో లేకుండా చేస్తానుకోలేదు. ఎందుకు తనకు ద్రోహం తలపెట్టాడనే విషయం అతని ముఖం మీదే అడిగేద్దాం, కడిగేద్దాం అని వెళితే భాస్కరబాబు ఆఫీసులో లేడు. మీటింగ్‌కి వెళ్లి ఇంకా రాలేదు భాస్కరబాబు. సాయంత్రం వరకు చూసి చూసి ఇక చీకటిపడుతుంటే కంపెనీ నుంచి నీరసంగా కాళ్లీడ్చుకుంటూ బయటకు వచ్చేడు. వర్షం పడుతూనే ఉంది. ఉదయం నుంచీ సూర్యకిరణాలను కొండ చిలువలా మింగేసిన మబ్బుల వర్షం చీకటితో చెలిమి చేస్తోంది. సయ్యాటలాడుతోంది. వర్షానికి భయపడి కేంటిన్‌లో తల దాచుకున్నాడు.

రాత్రి పావుతక్కువ ఎనిమిది గంటలవుతోంది. కురిసి కురిసి విసిగిపోయిన వర్షం కాస్త విశ్రాంతి తీసుకోవడంతో కొంత తెరిపి ఇచ్చింది.

వీరన్న కాళ్లు భాస్కరబాబు ఇంటి వైపు కదిలేయి. అయితే అతనిలో స్పీడు తగ్గిపోవడం వాస్తవం. అతనిలో ఏదో నిరాశక్తత. నిర్లిప్తత.

భాస్కరబాబు ఇంట్లో ఉన్నాడు. విద్యుద్దీపాల వెలుగులో, హాలులో కూర్చున్న బాబు ఎదుట ఒక వృద్ధురాలు రోదిస్తోంది. ఎవరామె? తను ఆమెను ఎక్కడో చూసినట్టు గుర్తుకొస్తోంది... అవును..కొన్ని గంటల క్రితం రోడ్డుపై తననుంచి ఒక రూపాయి తీసుకున్న భిక్షగత్తె! ఆమె ఎందుకుంది ఇక్కడ?

భాస్కరబాబు వీరన్నని చూడగానే ''రావయ్యా! కూర్చో. నీ కోసమే చూస్తున్నాను. నీ విషయం తర్వాత చూద్దాం. ముందు ఈమె ఎవరో గుర్తు పట్టేవా?'' అనడిగేడు.

''లేదు'' అన్నాడు వీరన్న- ఆమెను గుర్తించే ప్రయత్నం ఏమీ చేయకుండానే.

''సరి సరేలే. గుర్తుపట్టగలిగితే నీవు ఆమెను భిక్షగత్తెను చేయవు. సరిగ్గా ఆమెను చూడు. ఎవరో కాదు మన కాంతమ్మ! మెసెంజర్ కాంతమ్మ!'' అని తెలియజేసేడు.

వీరన్న షాక్ తినేశాడు. ఆమె కాంతమ్మా! గుర్తుపట్టలేనంతగా శుష్కించిపోయింది. యాభైమూడేళ్ల కాంతమ్మ! ఆమెకు కొన్ని గంటల క్రితం రూపాయి భిక్ష వేసినందుకు సిగ్గుపడ్డాడు. కాంతమ్మను క్షమాపణలు అడిగేడు వీరన్న.

కాంతమ్మ గురించి తనకు కొంతే తెల్సు. భాస్కరబాబుకి పూర్తిగా తెలుసు. ఆమె జీవితం అంతా భాస్కరబాబు చెబుతుంటే తను వచ్చిన పని మరచి చెప్పినదంతా విన్నాడు వీరన్న.

★ ★ ★

ఇరవై మూడేళ్ల కిందట తాము పనిచేస్తున్న కంపెనీలోనే మెసెంజర్ ఉద్యోగంలో జాయిన్ అయింది కాంతమ్మ. అప్పుడామె వయసు ముప్పయి సంవత్సరాలు. అప్పుడామెకు భర్తలేడు. అంటే పెళ్లి కాకడపోవడం కాదు. అప్పటికే ఆమెకు పెళ్లికావడం, మొగుడు చచ్చిపోవడం రెండూ జరిగిపోయేయి. అంతేకాదు ఆమెకు ముగ్గురు ఆడపిల్లలు. సంతానం ఉన్నారన్న విషయం ఆమెను చూస్తే అనిపించదు. ఆమె చెబితేనే తెలుస్తుంది.

ఎవరైనా అడిగితే కాంతమ్మ తనకు ముగ్గురు పిల్లలు కాదు, ఆరుగురు ఆడపిల్లలు అని చెబుతుంది. కాంతమ్మ అప్పన్నకి రెండవ భార్య. మొదటిభార్య నర్సమ్మ చచ్చిపోయేక కాంతమ్మను చేసుకున్నాడు. నర్సమ్మ ముగ్గురు ఆడపిల్లల్ని కనేసి చనిపోయింది. కాంతమ్మకి ముగ్గురు ఆడపిల్లలు పుట్టేక అప్పన్న చచ్చిపోయేడు. గొంతు మయ్యి తాగేసి కళ్లు పేలిపోయి దారుణంగా చచ్చిపోయేడు.

కాంతమ్మ ఆరుగురు ఆడపిల్లలతో వీధిన పడింది- అప్పన్న చనిపోయేక.

అప్పట్లో ఆ కంపెనీ రూలు ప్రకారం, బ్రతుకు తెరువుకోసం అప్పన్న ఉద్యోగం కాంతమ్మకి ఇచ్చేరు. సకాలంలో ఆమెకు ఆ సహాయం చేసింది ఎవరో కాదు భాస్కరబాబే.

నవనవలాడుతూ కాంతమ్మ ఉద్యోగంలో చేరి ఆరు నెలలు అయ్యేసరికి..ఆమె వయసుకి మరింత బిగువు, అందానికి మరింత మెరుపు, నునుపు వచ్చేసేయి దాంతో ఎన్నో కంత్రీకళ్లు ఆమెపై పడ్డాయి. వేధించేయి. కాంతమ్మ ఆ చూపులకు పడిపోలేదు. జారిపోలేదు. నిలబడింది. ఎవరైనా దగ్గరకు వస్తే చెప్పుతో సమాధానం చెప్పేది.


తర్వాత కూడా ఏ బలహీనతలకు లొంగకుండా నిగ్రహంతో నిప్పులా నీతిగా చివరిదాకా ఉండిపోయింది. ఆరుగురు ఆడపిల్లల ఆలనాపాలనాతో కాంతమ్మకి తెలియకుండానే కాలం దొర్లిపోయింది. సాగిపోయింది.

కాంతమ్మ తను కన్న ముగ్గురు పిల్లల్ని ఒకలాగ, నర్సమ్మకి పుట్టిన ముగ్గురు పిల్లల్ని మరొకలాగా చూడలేదు. పెంచలేదు. అందర్నీ ఒకేలా ప్రేమగా చూసుకునేది. ఆడపిల్లలకి పదహారేళ్లు రాగానే కిందా మీదా పడి ఏమైతేనేం ఆరుగురు కూతుళ్లకీ పెళ్లిళ్లు చేసేసింది. పెళ్లిళ్లు అయిపోయినా కూతుళ్లు కాంతమ్మను వదిలేవారు కాదు. మొగుళ్లవి చిన్న చితకా ఉద్యోగాలు. కూతుళ్ల పురుళ్లు, పండగలు, రోగాలు, రొప్పులు ఇతరత్రా సమస్యలతో కాంతమ్మ ఇల్లు వచ్చిపోయే రైళ్లతో నిండిపోయే ప్లాట్‌ఫారంలా ఉండేది.

కాంతమ్మ జీతం సరిపోయేది కాదు. ఇబ్బందులు ఎదురయ్యేవి. చేసిన అప్పులకి వడ్డీలు కట్టడం కష్టమయ్యేది.

సరిగ్గా ఆ సమయంలోనే స్వచ్ఛంద పదవీ విరమణ పథకం ఒక ఆశగా, మాయగా, చాపకింద నీరుగా ఆ కంపెనీలోకి చొరబడింది. విఆర్‌యస్ గాలానికి పడిపోయిన మొదటి చేప కాంతమ్మే.

అతి త్వరలోనే ఒక ప్రయివేట్ కంపెనీ ఈ కంపెనీని స్వాధీనపరుచుకుంటుందని, ఉద్యోగులకు మూడు నెలల నోటీస్ కూడా ఇవ్వకుండా నిర్దాక్షిణ్యంగా ఉద్యోగాలు పీకిపారేస్తారనీ, మెసెంజర్ లాంటి కార్మికులు అసలు అక్కరలేదని కాంతమ్మని భయపెట్టేరు.




విఆర్‌యస్ తీసుకొమ్మని ఒక వైపు కంపెనీ నుంచి ఒత్తిడి. మరోవైపు ఆరుగురు కూతుళ్లనుంచి ఒత్తిడి. కాంతమ్మ కూతుళ్ళపై అల్లుళ్ల ఒత్తిడి.

తాను రిటైర్ అయ్యేక ఒక్కొక్క కూతురికి 50 వేలు చొప్పున ఇస్తానని కాంతమ్మ పొరపాటున ఎప్పుడో, ఏనాడో నోరు జారింది. అంతే. కూతుళ్లకి అడ్డంగా దొరికిపోయింది. కూతుళ్లకి డబ్బు అవసరమట. అప్పులు చేసేసారట. చేసిన అప్పులు కొంపల్ని ముంచేస్తున్నాయట. అందుకు తను వేగిరం విఆర్‌యస్ పెట్టేయాలట.

చివరికి ఏమైతేనేం కాంతమ్మ పదేళ్లు సర్వీసు వదులుకొని, అయిదు పదుల వయసులోనే ఆరు లక్షల రూపాయలతో కంపెనీ నుంచి బయటకు వచ్చింది. బయటకురాగానే తాను చేసిన అప్పులు తీర్చేయడానికి లక్ష రూపాయలు ఎగిరిపోయాయి. ఎప్పుడో తను ఇచ్చిన మాట ప్రకారంగా ఆరుగురు కూతుళ్లకి యాభై వేలు చొప్పున మూడు లక్షలు సమర్పించేసింది. మిగిలిన రెండు లక్షలు ఊళ్లో వున్న ఒక ఫైనాన్సింగ్ కంపెనీలో తన తోటి సహచరుల సలహాపై డిపాజిట్ చేసింది. ఆమెకు తెల్సి చాలామంది ఉద్యోగులు తమ విఆర్‌యస్ సొమ్ము అంతా అక్కడే డిపాజిట్ చేశారు. పోస్టాఫీసు, బ్యాంకుల్లో వేస్తే వాళ్లు ఇచ్చే వడ్డీతో ఏమి బతగ్గలం? తను డిపాజిట్ చేసిన ప్రయివేట్ ఫైనాన్సు కంపెనీ అయితే నూటికి రెండు రూపాయలు వడ్డీ ఇస్తోంది అంటే- ప్రతి నెలా వడ్డీ రూపేన నాలుగు వేలు వస్తాయి. హాయిగా బతికేయవచ్చు అనుకుంది కాంతమ్మ.

పాపం కాంతమ్మ ఆ వడ్డీ డబ్బులు మూడు నెలలు కూడా తినలేదు. ఒక్కసారిగా ఒకరోజు ఆ ఫైనాన్సింగ్ కంపెనీ బోర్డు తిప్పేసింది. దాంతో లబోదిబోమని గుండెలు బాదుకుంది కాంతమ్మ. ఎంతోమంది రిటైర్డు ఉద్యోగులతోబాటు తను కూడా పోలీస్‌స్టేషన్ చుట్టూ తిరగడమే కనిపించింది తప్పా పోయిన డబ్బు దక్కలేదు.

తల్లిని ఓదార్చి, కూతుళ్లు తమతోబాటు తీసుకువెళ్లలేదు. పెంచీ పోషించి తన రిటైర్‌మెంట్ సొమ్ములో సగం దోచిపెట్టిన తల్లీ బరువే అయింది. కాంతమ్మ పరిస్థితి వీధి కుక్కకన్నా హీనమయింది అక్కడ.

ఆ పరిస్థితిలో భాస్కరబాబు ఇంటికి వచ్చి అతని కాళ్లపై పడిపోయింది. ముందుగా శకుంతలమ్మ కాంతమ్మకి కడుపునిండా భోజనం పెట్టింది. భాస్కరబాబు ఏం చేయగలడు? చేస్తున్న ఉద్యోగం వదలి వెళ్ళిపోయినవారికి మళ్లీ ఉద్యోగం ఎవరు ఇస్తారు. ప్రస్తుతం కాంతమ్మ వయసు 53 ఏళ్లు. ఉద్యోగం వదలకుంటే మరో ఏడేళ్లు బతుకు హాయిగా సాగిపోయేది.

ప్రస్తుతానికి కాంతమ్మను తన ఇంటి దగ్గరే ఉండిపొమ్మన్నాడు భాస్కరబాబు. వీలుచూసుకొని ఆమెను ఓల్డేజ్ హోమ్‌లో చేర్పించాలనే ఆలోచనలో ఉన్నట్టు చెప్పేడు.

కాంతమ్మ కథ విని వీరన్న చాలా బాధ

పడ్డాడు. దారుణ పరిస్థితుల్లో ఉన్న కాంతమ్మకి ఆశ్రయమిచ్చిన భాస్కరబాబుకి చేతులెత్తి నమస్కరించేడు.

ఈలోగా- శకుంతలమ్మ పార్వతమ్మతో హాలులోకి ప్రవేశించింది. స్టేజిపై మరో అంకానికి తెరలేచినట్టు.

అక్కడ పార్వతమ్మను చూసి తెల్లబోయాడు వీరన్న.

''నీవు మధ్యాహ్నం రుసరుసలాడుతూ ఇంటి నుంచి వెళ్ళిపోయి రాత్రయినా ఇంటికి చేరకపోతే భయపడి గంట క్రితం మీ పిల్లలు వచ్చి వెళ్లేరు. ఇప్పుడు ఏడుస్తూ మీ ఆవిడ వచ్చింది- నీకన్నా ఓ పది నిముషాలు ముందు'' అని తెలియజేసింది శకుంతలమ్మ.

''నా వీఆర్‌యస్ అప్లికేషన్ ఎందుకు ఆపేరు మీరు?'' అడిగాడు వీరన్న అదేమీ పట్టించుకోకుండా. అందులో తీవ్రత లేదు.

''ఆపమన్నది నేను'' అన్నది పార్వతమ్మ. చాలా స్పష్టంగా గుడిలో గంటలా. పిడుగులా, కత్తిలా.

వీరన్న అప్రతిభుడయ్యేడు.

''ఆ మాట నీ భార్య ఇక్కడ కాకుండా మీ ఇంటి దగ్గర అనివుంటే ఈపాటికి ఆమె పని అయిపోయేది. అవునా'' అంది నవ్వుతూ శకుంతలమ్మ-

''చూడు వీరన్నా! నిన్ను తక్కువ చేసి మాటాడుతున్నానని అనుకోకు. ఆమెకున్న తెలివితేటలు, వివేకం, ముందుచూపు నీకు లేవంటున్నానని బాధపడకు. పార్వతమ్మకి భర్తవి కావడం నీ అదృష్టం అని తెల్సుకో''

అసలు ఏమిటి వీళ్లు మాటాడుతున్నది? కోపమొస్తోంది వీరన్నకి.

''పార్వతమ్మ బాధ నేను చెబుతాను విను'' అన్నాడు భాస్కరబాబు. ''వీఆర్‌యస్ పెడితే రాబోయే ఎనిమిదిన్నర లక్షలతో నీవు నీ పిల్లల అవసరాల గురించి ఆలోచించేవు. కాని పిల్లల గురించి కాకుండా నీ గురించి ఆలోచించింది పార్వతమ్మ. రెండు రోజుల కిందట పార్వతమ్మ మా ఇంటికి వచ్చింది. వచ్చి ఒకటే ఏడుపు. నేను పతి భిక్ష పెట్టాలట. 'నాకు ఆ మాయదారి డబ్బు వద్దు. నాకు నా భర్త కావాలి. అతన్ని రక్షించండి. నాకు దక్కించండి' అంది.

నీకు రేయింబవళ్లు ఒళ్లు దాచుకోకుండా వీరుడిలా ఫ్యాక్టరీలో కష్టపడ్డమే తెలుసట. కంపెనీలో కష్టపడటం తప్పించి మరి నీకేమీ తెలియదట. పనిలేకుండా నీవు ఇంట్లో ఖాళీగా కూర్చోలేవట. ఎప్పుడయినా వరసగా రెండు, మూడు రోజులు శలవు దినాలు వస్తే బోర్ కొట్టి ఇంట్లో ఎంత విసుగ్గా, చిరాగ్గా వుంటావో చెప్పిందయ్యా మీ ఆవిడ.

మీ ఆవిడ అన్నది నిజమే. మనకి రోగాలు కంపెనీ నుంచి బయటకు వచ్చేకే వస్తాయిలా ఉంది. నీకు వెల్డర్ జగన్నాథరావు తెల్సుకదా! వీఆర్‌యస్ తీసుకుని బయటకు వచ్చిన పదిరోజులకే హార్ట్ అటాక్ వచ్చింది. కార్పొరేట్ ఆస్పత్రికి వీఆర్‌యస్‌లో వచ్చిన సొమ్మంతా ఖర్చు పెడితే బతికి బయటకొచ్చేడు. చేతిలో పైసా లేదు. ఇప్పుడెలా బతకాలి? గుండెపోటుతో చచ్చిపోయినా బాగుణ్ణు అని ఏడుస్తున్నాడు. పోనీ ఆ గుండెజబ్బు ఏదో సర్వీసులో ఉన్నప్పుడు వచ్చినా బాగుణ్ణు. అది కంపెనీ భరించేది అని ఏడుస్తున్నాడు'' అని చెప్పేడు భాస్కరబాబు.

''ఇదిగో వీరన్నా! నీవు ఇంటికి వెళ్లేక పార్వతమ్మపై మండిపడకు. తన భయాలు నీకు చెప్పబోతుంటే నీవు వినిపించుకోకపోతే, అసలు పూర్తిగా వినకుండా కొట్టిపారేస్తుంటే తన గోడు అంతా మాతో చెప్పుకుంది. నీవు మా మాట వింటావనే నమ్మకంతో విన్నవించుకుంది. పార్వతమ్మ కంపెనీ క్వార్టర్స్‌లోనే ఉండటం చేత కంపెనీ అన్ని విషయాలు తెలుస్తున్నాయి. అవగతమవుతున్నాయి. నలుగురి ఆడవాళ్ల మధ్య నాలుగు విషయాలు తెల్సి మంచీ చెడు వివేచనతో ఆలోచించగలుగుతోంది. నేను పూర్తిగా మీ ఆవిడ అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నాను. వీఆర్‌ఎస్ పులి కోరలకి నీవు బలి కాకుండా రక్షించమన్నది గనుక నీ అప్లికేషన్ ఫార్వర్డ్ చేయకుండా నా టేబుల్‌పై ఆపేశాను. నీ భార్య గోడు మా ద్వారా విన్నావు కదా! నీవు వీఆర్‌యస్ పట్ల మోజు చూపిస్తే నీ పేరు రేపు లిస్టులో చేర్పించడం నాకు ప్రాబ్లెమ్ కాదు. ఏమంటావ్'' అనడిగేడు భాస్కరబాబు.

వీరన్న మాటాడలేదు. అతను ఆలోచిస్తున్నది పార్వతి గురించి.

శకుంతలమ్మ కూడా కలుగజేసుకుని వీరన్నకి నచ్చజెప్పే ప్రయత్నం చేసింది.

''చూడు వీరన్నా! పూలు పూసే మొక్క, పళ్లు కాసే చెట్టు కాని కాలం వచ్చి కాపు ఆగిపోతే మనం ఏం చేస్తాం? మొక్కను పీకి పారేస్తాం. చెట్టును గొడ్డలితో నరికేస్తాం. నెల నెలా జీతం తెస్తూ పచ్చని సంసారాన్ని నిలబెడుతున్న యజమాని ఎండుమొక్క, బీడు చెట్టు, ఒట్టిపోయిన ఆవు కాకూడదని నా ప్రార్థన''

''నా ప్రార్థనా అదే'' కన్నీళ్లతో అన్నది పార్వతమ్మ.

''మీ ఆవిడ ప్రార్థన వినిపిస్తోందా?'' అని నవ్వుతూ అడిగేడు భాస్కరబాబు.

''చూడు వీరన్నా...సంపాదిస్తున్నప్పుడే ఇంటి యజమానిని ఇంట్లో గుర్తిస్తారు. గౌరవిస్తారు. నీకు భయపడతారు. నీ మాట వింటారు. అదే నీవు రిటైర్ అయ్యేక అనగా సంపాదించడం ఆగిపోయేక స్విచ్ ఆపు చేస్తే దీపం ఆరిపోయినట్లు అన్నీ ఆగిపోతాయి. నీవు ఇంట్లో డిపెండెంట్‌గా మారిపోతావు. ఇంతకాలం నీవు చెలాయించిన అధికారం నీ తెలియకుండానే మరొకరి చేతుల్లోకి వెళిపోతుంది. పవర్ పగ్గాలు తీసుకోబోయేది నీ కొడుకు కావొచ్చు. నీ కూతురు కావొచ్చు లేకుంటే భార్య కావొచ్చు. ఇప్పుడామె నీకు జడుస్తోంది. రేపు నీవు ఆమెకు జడిసే పరిస్థితి రావచ్చు. అంతే కదమ్మా పార్వతమ్మా'' అన్నాడు నవ్వుతూ భాస్కరబాబు.

'అవును' అనకుండా ముసిముసిగా నవ్వేసింది పార్వతమ్మ.

''నాచురల్ రిటైర్‌మెంట్ అయి ఇంటిపై ఆధారపడ్డాక ఎలాగూ తప్పవు మనకు పాట్లు. అవేవో పదేళ్ల ముందే కొని తెచ్చుకుని నరకం అనుభవిస్తానంటే ఎట్లా'' అన్నాడు భాస్కరబాబు. ''ఇప్పుడు చెప్పు వీఆర్‌యస్ లిస్టులో నీ పేరు చేర్చాలా వద్దా''

''వద్దుసర్ వద్దు. నేనప్పుడే రిటైరవ్వదల్చుకోలేదు'' అన్నాడు వీరన్న.

ఆ మాటకి అందరూ సంతోషించేరు. ముఖ్యంగా పార్వతమ్మ.

''అలాగన్నావు బావుంది. అందరికీ సంతోషంగా ఉంది'' అంది శకుంతలమ్మ.

''వీరన్నా! ఇకపోతే నీ పిల్లల అవసరాలు. అవి అందరికీ ఉంటాయి. నీవు వీఆర్‌యస్‌కి వెళ్ళిపోవలసిన తక్షణ అవసరాలు కావు. ఒక పియఫ్ లోను పెట్టు. తర్వాత చూద్దాం. ఇకపోతే రెండో అమ్మాయి పెళ్లికి తొందర లేదు. చదవనీయ్. చదివి ఉద్యోగం చేయనీయ్. మారుతున్న రోజులు గమనించు. నీవు అరవయ్యోపడిలో రిటైరయ్యేలోగా ఇద్దరు పిల్లలూ ఉద్యోగాల్లో సెటిల్ అవ్వనీ. అర్థమయిందా''

అలాగే అన్నాడు వీరన్న.

శ్రీకృష్ణుడి ముందు అర్జునుడిలా రెండు చేతులు జోడించి లేచేడు వీరన్న. అతని కళ్లు మెరుస్తున్నాయి. గుండె తేలికయింది. అతనిలో ఏదో చైతన్యం.

అతని గుండెల్లో ప్రేమ వర్షం అతనిలో సగం పార్వతమ్మపై పొంగి ప్రవహిస్తోంది.

తర్వాత భార్యాభర్తలిద్దరూ భాస్కరబాబు దంపతులనుంచి శలవు తీసుకున్నారు.

బయట వర్షం. ''అయ్యో! వర్షం గట్టిగా కొడ్తోంది గొడుగు తీసుకెళ్లండి'' అంది శకుంతలమ్మ.

''గొడుగు వద్దండి. ఆయనకు వర్షంలో తడవటం ఇష్టం'' అంది పార్వతమ్మ.

''అయితే ఆయన్ని తడవనీయ్. నీవు గొడుగు వేసుకో'' అని గొడుగు ఇవ్వబోయింది.

''వద్దు వద్దండి. ఆయనతోబాటే నేనూను'' అంది సిగ్గుపడుతూ పార్వతమ్మ.

''అయితే తడవండర్రా తడవండి. మస్తుమస్తుగా తడవండి. శుభం'' అంది శకుంతలమ్మ నవ్వుతూ.

మస్తుమస్తుగా తడిసిన వర్షంలో ప్రవహించింది పారవశ్యం.

☆

